

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.33 (గురువారం సాయంత్రం) | సహర్ : 4.58 (శుక్రవారం ఉదయం)

విధి రాత(తఖ్దీర్)ను దువా తప్ప మరేదీ మార్చ జాలదు. అదృష్టాన్ని మార్చగలది ఏదైనా ఉన్నదంటే అది ప్రార్థన. దువా మాత్రమే.

సంక్షేమ బడ్జెట్ ఇది : ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్రంలో సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తుందని, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ధ్యేయంగా రూపొందించిన సంక్షేమ బడ్జెట్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని ఆయన అన్నారు. గిరిజన సంక్షేమానికి రూ.17,169 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి ఆశాజనకంగా నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు.

జిల్లాకు అన్యాయం : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పొందుపరిచిన ఆర్థిక సంవత్సరం 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో దత్తత జిల్లాకు ఈ సారైనా ప్రత్యేక నిధులు కేటాయిస్తారని ఎదురు చూశామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. భట్టి విక్రమార్క పొందు పరిచిన ఈ బడ్జెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దత్తత జిల్లా ఆదిలాబాద్‌కు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా.. రెండు ఆర్థిక సంవత్సరాల బడ్జెట్‌లో కేటాయించిన జిల్లాకి మాత్రం ఒక్క రూపాయి కూడా దక్కలేదని ఆరోపించారు. అసమర్థ కాంగ్రెస్ పాలనలో సాగునీరు అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కాగా, బుధవారం ఎండిన వరి కంకులతో అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు.



వరి కంకులతో నిరసన తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే

ఉట్నూర్ కేజీబీవీలో వైద్య శిబిరం

ఉట్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వేసవికాలంలో ప్రబలనున్న వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సంతోష్ సూచించారు. ఈ సందర్భంగా 50 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో స్పెషల్ ఆఫీసర్ సువర్ణతో పాటు సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

నార్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యాపూర్ గ్రామంలో గల బాలికల పాఠశాలలో బుధవారం తుడుందెబ్బ జిల్లా సంఘం అధ్యక్షుడు పెందూర్ దాదిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్సిళ్లు, పరీక్ష అట్టలు, పెన్నులు, సంఘ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్ష సమయంలో పది నిమిషాల కంటే ముందే సెంటర్‌కు చేరుకోవాలని పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు దన్ను, చవాన్ సుభాష్, జాదవ్ విజయ్‌సింగ్, ఎస్ఆర్‌పీ సరోజ, జ్యోతి కుమారి, ఆత్రం జలింశావ్, మొతిరాం, కొట్నాక్ శ్రీరాం పాల్గొన్నారు.

బీసీ బిల్లు దేశానికే మార్గదర్శకం

తలమడుగు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలపడంతో సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి ఆదర్శమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మీ రాజేశ్వర్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ, యువకులకు రాజీవ్ యువ వికాసం ప్రవేశ పెట్టినందుకు హర్షిస్తూ మండలంలోని గంగన్నపేటలో హనుమాన్ భక్తులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో బీసీ సంఘం నేత గొల్లపెళ్లి శ్రీనివాస్ తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేసిన కాంగ్రెస్'

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సందర్భంగా ప్రజలకు చేతకాని హామీలు ఇచ్చి మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే విమర్శించేందుకు నోరు ఎలా వచ్చిందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం పార్డీ (బి) గ్రామాన్ని సందర్శించిన అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. రైతు రుణమాఫీ చేయకపోవడం, రైతు బంధు ఇవ్వకపోవడం వల్ల రైతులు ప్రభుత్వంపై తిరగబడుతున్నారన్నారు. మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ నాయకులు.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి డిపాజిట్ కూడా దక్కదని పేర్కొన్నారు. ఆయన వెంట పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సంక్షేమానికి.. పెద్దపీట







- రాష్ట్ర బడ్జెట్‌లో కనిపించని జిల్లా ప్రస్తావన
- ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని రుణమాఫీ, రైతుభరోసా
- ఇందిరా గిరి జల వికాసం పథకంలో గిరిజన రైతులకు మరింత మేలు
- విద్యుత్ అంతరాయానికి తక్షణ పరిష్కారం చూపనున్న విద్యుత్ అంబులెన్స్‌లు
- ప్రత్యేకంగా జిల్లా సాగునీటి ప్రాజెక్టుల జోలికి వెళ్లని రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు

ఆదిలాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 2025-26 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినట్లు కనిపించింది. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌లో సంక్షేమం, ఆరు గ్యారెంటీలకే ఎక్కువగా నిధుల కేటాయింపు జరిగింది. ఇందులో ముఖ్యంగా వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ. 1674 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.2,862 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.31605 కోట్లు, గృహ నిర్మాణ శాఖకు రూ.14154 కోట్లు కేటాయించారు. అంతంత మాత్రంగానే సాగునీటి వనరులు ఉన్న జిల్లాకు రాష్ట్ర బడ్జెట్లో ప్రత్యేకమైన కేటాయింపులు జరగలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు భరోసాను ఇచ్చే విధంగా బడ్జెట్లో కేటాయింపులు లేవన్న చర్చ జరుగుదతోంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకే ప్రభుత్వం ఎక్కువ నిధులను కేటాయించిందన్న వాదనలున్నాయి. మొత్తానికి రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది.

రుణమాఫీ కాలేదు.. రైతు భరోసా రాలేదు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. రైతు భరోసా ఇంకా రాలేదన్న చర్చ సాగుతోంది. జిల్లాలో బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు లక్షా ఇరవై వేల మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు రూ.2 లక్షల లోపు 63 వేల మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం గాను ప్రభుత్వం రూ.670 కోట్లను కేటాయించినట్లు తెలుస్తుంది. అలాగే రైతు భరోసా పథకం అమలును ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు 4 ఎకరాల వరకు మాత్రమే రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సహాయం అందినట్లు రైతులు చెబుతున్నారు. ఈ రెండు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమలులో మాత్రం అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా ఎకరాలకు పెట్టుబడి సహాయం ఎప్పుడు అందుతుందోనన్న ఆందోళన కనిపిస్తుంది. బడ్జెట్లో నిధులను కేటాయిస్తున్నా.. అమలులో మాత్రం ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు జరగడం లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు.

పేరు మార్చినా.. నిధులు అందేనా?!

గత ప్రభుత్వ హయాంలో గిరిజనుల పోడు భూములకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేసేందుకు గిరి వికాసం పథకాన్ని అమలు చేశారు. ప్రభుత్వం మార్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఇందిర గిరి జల వికాసం పథకంగా పేరు మార్చి అమలు చేస్తుంది. ఈ పథకం అమలుకు బడ్జెట్లో రూ.12600 కోట్ల నిధులను కేటాయించింది. అయితే నిధుల కొరత కారణంగానే గతంలో ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ సారైనా అవసరమైన మేరకు నిధులు మంజూరు చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు. జిల్లాలో 10,496 మంది గిరిజన రైతులు గిరి వికాసం పథకానికి గతంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 1,950 మంది రైతులకు మాత్రమే పథకాన్ని వర్తింప చేశారు. మిగతా 8546 మంది రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ పథకం

(తరువాయి 6వ పేజీలో...)

రాష్ట్ర బడ్జెట్లో జిల్లాకు గుండుసున్నా కేటాయింపులు

: జోగు రామన్న, మాజీ మంత్రి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జిల్లాకు గుండుసున్నా కెటాయింపులే ఉన్నాయి. జిల్లావాసులు బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నా చివరకు నిరాశనే మిగిలింది. జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జిల్లా ఇంచార్జీ మంత్రి విపలం కావడంతోనే జిల్లాకు చెప్పుకునే విధంగా కెటాయింపులు జరగలేదు.

బడ్జెట్ కేటాయింపులు సరిగ్గానే ఉన్నాయి

: కంది శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కెటాయింపులు ఫర్ఫెక్ట్‌గా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి భారీగా నిధుల కెటాయింపు జరిగింది. మునుపెన్నడు లేనివిధంగా వ్యవసాయ, సాగునీటి రంగానికి నిధుల కెటాయింపు చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదు

: పాయల శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జిల్లాకు ఆశించిన స్థాయిలో కెటాయింపులు జరగలేదు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధుల కెటాయింపు లేకపోవడం జిల్లా రైతాంగాన్ని నిరాశకు గురిచేసింది. జిల్లాకు ప్రత్యేకంగా నిధుల కెటాయింపు లేకపోవడం బాధకరం. గత బడ్జెట్లో కెటాయించిన నిధులనే ఇప్పటి వరకు వంజూరు చేయలేదు. ఈ బడ్జెట్ కూడా అంకెల గారడిగానే కనిపిస్తుంది.

పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

- జిల్లావ్యాప్తంగా 52 సెంటర్లలో పరీక్ష రాయనున్న 10,106 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో గుంపులుగా తిరగడానికి అనుమతి లేదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జరిగే పదవ తరగతి పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు 52 సెంటర్లలో 10,106 విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలను రాయనున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు ఎవరూ గూమిగూడి ఉండరాదని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులకు, డీజేలతో, ఊరేగింపులకు, ధర్నాలకు, ప్రచారాలకు అనుమతులు లేవని తెలిపారు. పరీక్ష సమయంలో పరిసర ప్రాంతాలలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలను మూసివేసి ఉంచాలని తెలిపారు. పట్టణంలో విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది ద్వారా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్న పత్రాలు అందజేయు క్రమంలో సరైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష పూర్తి అయి, తిరిగి జవాబు పత్రాలు వెళ్లే వరకు బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పట్టణంతో పాటు జిల్లావ్యాప్తంగా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ద్వారా నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసు పెట్రోలింగ్ పార్టీలు గస్తీ నిర్వహిస్తూ ఉంటాయని, లేనిచో డయల్ 100ను వినియోగించుకోవాలని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఉట్నూర్ పోలీసు స్టేషన్ సందర్శించిన ఎస్పీ అఖిల్ మహాజన్



కేస్లాపూర్‌లో నాగోబా దేవతను దర్శించుకున్న ఎస్పీ, ఉట్నూర్ ఏఎస్పీ

అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం అందించాలి

ఉట్నూర్: అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ప్రజల్లో, ఆదివాసులతో మమేకమై విధులను నిర్వర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను, సిబ్బంది విధులను పరిశీలించారు. మొదటగా ఇరు పోలీస్ స్టేషన్ల అధికారులు జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి స్వాగతం పలికి, సిబ్బందిని పరిచయం చేశారు. తదుపరి పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చిల్డ్రన్ పార్కులను పోలీసు కుటుంబ సభ్యులు పిల్లలు వినియోగించుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో భారీగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నమోదు కాకుండా చూడాలన్నారు. ప్రజలకు విరివిగా సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పర్చాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యువతకు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డుపై తీసుకునే జాగ్రత్తలను వివరించాలని, ప్రతీరోజు సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. గంజాయి పండించడం, తాగడం, కలిగి ఉండడం, వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఆదివాసీలతో ప్రతీరోజు మమేకమైతే గ్రామాలను సందర్శిస్తూ విధులను నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న అనవసర వాహనాలను చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్, పీఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత స్థానిక పీఎస్ సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై దుబ్బాక సునీల్ పలు సూచనలు చేశారు. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆయన వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రొఫెసర్లు, సిబ్బంది(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్)

సేవలు అందించడంలో వైద్యులు ముందుండాలి : కలెక్టర్

ఆదిలాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది ముందుండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం రిమ్స్ డైరెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రికి వచ్చే వారందరూ పేద ప్రజలేనని, వారిని దృష్టిలో ఉంచుకొని వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గైనకాలజీ విభాగంలో అన్ని రకాల డెలివరీస్ చేయాలని, రిఫరల్ లేకుండా చూడాలని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీ నిమిత్తం వెళ్తున్నారని, డెలివరీ కోసం ప్రభుత్వ ఆసుపత్రి, రిమ్స్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరం ఉన్న మహిళలకు ట్యూబెక్టమీ చేయడంలో ముందుండాలని తెలిపారు. తర్వాత అన్ని శాఖల ప్రొఫెసర్లను వారివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పేషెంట్లను చూసుకునేందుకు పేషెంట్ కేర్లు ఉన్నారని, రోగులకు ఎలాంటి అవసరాలు ఉన్న పేషంట్ కేర్ ద్వారానే చేయించాలని తెలిపారు. ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్ రక్త పరీక్షలతో పాటు అన్నిరకాల పరీక్షలకు సంబంధించి ప్రొఫెసర్లు ప్రత్యేకశ్రద్ధ వహించాలని పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ అశోక్, డాక్టర్ సత్యనారాయణ, తదితరులున్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాధికారి మొహమ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మండలంలో మొత్తం నాలుగు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు. నాలుగు సెంటర్లలో 680 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అయితే అన్ని సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన వసతులను ఇప్పటికే పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల బోర్డు వారు అన్ని సెంటర్లలో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఆదివాసీ గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మోకాశి

గుడిహత్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మోకాశి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నీటి సమస్య ఉన్న చోట ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించటానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లు చెడిపోయి నీరు అందటం లేదని, చెడిపోయిన వాటికి మరమ్మతులు చేపట్టి నీటి కొరత లేకుండా చూడాలన్నారు.

'మంచినీటి సమస్య పరిష్కరించండి'

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. తమ కాలనీలో ఒకే బోరు ఉంది. తరచూ బోరు చెడిపోవడంతో మరమ్మతులు చేసుకుంటున్నామని తెలిపారు. గత నెల క్రితం కరెంట్ మీటర్ కాలిపోయింది. అప్పటి నుంచి మంచినీటి కోసం తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి మిషన్ భగీరథ నీరు కూడా రాదని, ఇప్పుడు మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని పలువురు కాలనీవాసులు వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయమై మండల అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



బోర్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బోథ్: మండల కేంద్రంతో పాటు సాయినగర్ కాలనీలో మంచినీటి ఎద్దడి రాకుండా నివారించాలని బుధవారం పంచాయతీ కార్యదర్శి అంజయ్య, ఎంపీడీవో రమేష్‌లకు బోథ్‌కు చెందిన మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డిలు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. తీరమైన ఎండల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలక రాజు, యూత్ ప్రెసిడెంట్ మేడిచర్ల ప్రవీణ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ స్వామి, రమణ, రఫీ, రమేష్, రూప్ చాంద్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ, నాయకులు బాపురెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

ఉట్నూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడి బజార్ సమీపంలో రేషన్ షాపు నడుపుతున్న డీలర్ క్రిష్టయ్య షాపు నుంచి ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తుండగా.. బుధవారం పట్టుకున్నామని ఉట్నూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ మనోహర్ తెలిపారు. అంగడి బజార్ సమీపంలో ఉన్న కిష్టయ్య షాప్ నుంచి లారీలో తరలించడానికి బియ్యం లోడ్ చేస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూడగా.. 40 సంచుల్లో ఉన్న 20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. డీలర్‌పై కేసు నమోదు చేశామని, పౌర సరఫరాల డీటీ ప్రేమ్ నివాస్‌కు సమాచారం అందించామని తెలిపారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ గురువారం వచ్చి పంచనామా నిర్వహించిన అనంతరం బియ్యాన్ని మండల్ లెవెల్ స్టాకిస్టు పాయింట్‌కు అప్పగించడం జరుగుతుందని డీటీ ఈ సందర్భంగా తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : కాటం

ఉట్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులతో పాటు పాఠశాల పేరు నిలబెట్టాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాటం రమేష్ అన్నారు. మండలంలోని షాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడుకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారత్ చౌహన్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ సర్పంచ్ జగదీశ్ జాదవ్, అంగన్‌వాడీ టీచర్ కాటం సంగీత రమేష్, సామాజిక కార్యకర్త కాటం రవీందర్, జాంబ్లే పాండురంగ్, పంచాయతీ సెక్రటరీ ప్రతాప్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసిన మహార్ సంఘ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే

ఆదిలాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీని బుధవారం మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీంరావ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ కాంబ్లే భీంరావ్ మహార్ సంఘం మహిళా అధ్యక్షురాలు సవిత బాయి, లక్ష్మణ్ రావు, సోషల్ వర్కర్స్ రామరావు పటేల్, మహార్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాల్వే, సమాజ్ కార్యకర్త జితేందర్, పవర్, బోథ్ మహా సంఘం ఉపాధ్యక్షుడు బీంరావ్‌రావు, జనరల్ సెక్రెటరీ మనోహర్, సోషల్ వర్కర్ మాధవ పాటిల్, సోషల్ వర్కర్ దయానంద్, పాల్గొన్నారు.

శాంతి సామరస్యంతో మెలగాలి : కంది

ఆదిలాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ శాంతి సామరస్యంతో మెలగాలని, కులమతాలకు అతీతంగా పండుగలను అందరూ కలిసిమెలిసి ఆనందంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోరమైన ఉపవాస దీక్షలు పతిస్తున్న ముస్లిం మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం, ప్రజాసేవా భవన్ వద్ద ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా ముస్లిం సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ విందులో వారితో కలిసి పాల్గొని పండ్లు, ఫలహారాలు తినిపించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రంజాన్ అంటేనే ఒక నియమనిష్ఠలతో కూడుకున్న పండుగ అన్నారు. నిబద్ధతతో ఎలా జీవనం సాగించాలో చాటిచెప్పే ఓ వేడుక అన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఉస్మాన్ ఖాసిం, తవక్కల్, ఆరిఫ్ ఖాన్, ముజాహిదీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, జిల్లా ఖాజీ నదీం, అడ్వకేట్ గౌస్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, షకీల్, అతీఖ్, రఫీ, ఖిజర్, నుస్రత్, ఫైజుల్ల ఖాన్, షౌకత్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఉద్యాన నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అధికారి సుధాకర్



నర్సరీలో తయారు చేసిన కంపోస్ట్‌ను పరిశీలిస్తూ..

రైతులకు వరం.. ఐటీడీఏ నర్సరీ

● జిల్లా ఉద్యాన అధికారి సుధాకర్

ఉట్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన పద సంస్థ(ఐటీడీఏ) ఉద్యాన నర్సరీ రైతులకు వరం లాంటిదని జిల్లా ఉద్యాన అధికారి సుధాకర్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీని ఆదిలాబాద్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సుధాకర్ సందర్శించారు. ఈ మేరకు ఉద్యాన నర్సరీలో చేపడుతున్న వివిధ రకాల పనుల గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి(పీహెచ్‌ఓ)గుడిమల్ల సందీప్ కుమార్ వివరించారు. నర్సరీలో సాగులో ఉన్న మామిడి, నిమ్మ, జామ, పుచ్చ తోటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన ప్రదర్శన క్షేత్రాలు ఇక్కడ ఏర్పాటు చేశారని ప్రశంసించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాలైనటువంటి మొక్కలను మామిడి, ఇప్ప, మునగ మొక్కలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెరువులను సైతం పరిశీలించి రైతులు ఉపాధి హామీ పథకంలో ఉన్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానాధికారి క్రాంతి కుమార్, నర్సరీ సాంకేతిక అధికారిని అర్షిత, సీపీఎఫ్ ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడి చేస్తారన్న ముందస్తు సమాచారంతో బోథ్ ఎస్సై బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్లను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌తో పాటు సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డిలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు అరెస్టులతో తమను అదుపులోకి తీసుకోవడం పిరికి చర్య అని పేర్కొన్నారు.

'మందకృష్ణ పోరాట ఫలితమే.. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం'

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏకగ్రీవ తీర్మానం చేయటం వెనుక మందకృష్ణ మాదిగ ఉద్యమ పోరాట ఫలితమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కూడాల స్వామి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ దీక్ష శిబిరం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. సుదీర్ఘ పోరాటం అనంతరం ప్రభుత్వంలో కదలిక వచ్చిందని, తమ న్యాయమైన కోరికను తీర్చేందుకు అసెంబ్లీ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇందులో జిల్లా నాయకులు కారం రవి, అశోక్, సురేందర్, మహేష్, సుభాష్, లక్ష్మణ్, దశరథ్, రాజు, అనిల్, గంగాధర్, నగేష్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలు

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని క్రాస్ రోడ్ వద్ద నిలిపి ఉన్న రిగ్గు బోర్ బండి వాహనం పైకి ఎక్కి బుధవారం ఉదయం మరమ్మతులు చేస్తుండగా.. పైన ఉన్న వ్యక్తి చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన ఫూల్ చంద్‌కు విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన వాహనం వారు ఆయనను ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించడం జరిగింది. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఈయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఈ విషయమై స్థానిక ఎస్సై ప్రవీణ్‌ను అడుగగా తమకు సమాచారం వచ్చిందని, విద్యుత్ షాక్‌కు గురైన స్థలాన్ని పరిశీలించామన్నారు. వాహనందారులు నిర్లక్ష్యంగా విద్యుత్ వైర్ల కింద వాహనాన్ని నిలిపి ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. లిఖితపూర్వకంగా ఇంకా తమకు సమాచారం రాలేదని పేర్కొన్నారు.

'కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి'

తలమడుగు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు కనపర్తి చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ గోడం నగేష్ సహకారంతో తలమడుగు మండలానికి కోటీ 50వేల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ సీసీ రోడ్స్ ఇవ్వడం జరిగిందనారు. పనులు త్వరగా పూర్తిచేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇందులో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాతాజీ కిరణ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు గోడం భుజంగరావు, నారాయణరెడ్డి, బోండ్ల వెంకటస్వామి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మహేందర్ యాదవ్, అశోక్, రవి రెడ్డి, అశోక్ రెడ్డి, సంజయ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులకు ప్రోత్సాహం

బోథ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు వెల్ఫేర్ సొసైటీ ద్వారా మరింత ప్రోత్సాహనిస్తుందని తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పార్డీ(బి) గ్రామంలో యువకులకు, క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. వేసవి కాలంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సాయంకాలం క్రీడలు ఆడుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పేర్ల అభిలాష్, మాజీ సర్పంచ్ మారుతి, మాజీ ఎంపీటీసీ రోహిదాస్, యువ నాయకులు భీమ్రావు పాటిల్, మునేశ్వర, సోమన్న, చిలుకూరి నరేందర్, చిన్నయ్య, మహేష్ సార్మెడి లక్ష్మణ్, పండు, సుంగన్న, గ్రామ యువకులు బీమ్రాజ్, నగేష్, సురేష్, శంకర్, సుదర్శన్, వెంకటేష్, రాము, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ట్రస్టు సభ్యుల సాయం

బోథ్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన అనిల్ అనే యువకుడు ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన గుల్జార్ మసీదు ట్రస్టు సభ్యులు.. వారి తరపున యువకునికి రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు. త్వరగా కోలుకోవాలని సహోదర దృక్పథంతో ఈ ఆర్థిక సహాయాన్ని చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

(5వ పేజీ తరువాయి...)

అమలులో అటవీశాఖ అనుమతులు ఇబ్బందికరంగా మారుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ జిల్లాలో వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి.

విద్యుత్ అంబులెన్స్ సేవలు

108 మాదిరిగానే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే అత్యవసర సమయంలో విద్యుత్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏదైనా ప్రమాదవశాత్తు విద్యుత్ సనఫరాలో అంతరాయం ఏర్పడితే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో పాటు అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ అంబులెన్స్‌లో ఒక అసిస్టెంట్ ఇంజనీర్‌తో పాటు ముగ్గురు లైన్మెన్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు. విద్యుత్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వస్తే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడికక్కడే మరమ్మతులు చేసి తిరిగి ఏర్పాటు చేసే వకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం రోజుల తరబడి విద్యుత్ అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు అంటున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు అరకొరగానే నిధులు

జిల్లాలో గత కొన్ని ఏళ్లుగా నిర్మాణ దశలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం బడ్జెట్లో అరా కొరగానే నిధులు కెటాయించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కోర్టా-చనకా బ్యారెజీకి రూ.179.13 కోట్లు, మత్తడివాగు ప్రాజెక్టుకు రూ.3 కోట్లు, సాత్నాలకు రూ.8.52 కోట్లు కేటాయించారు. కుప్టి, చిక్మాన్ ప్రాజెక్టుల నిర్మాణానికి గత ఏడాది బడ్జెట్లోనే రూ.234 కోట్లను కెటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇప్పటి వరకు నిధులను మంజూరు చేయకపోవడంతో అడుగు ముందుకు పడడం లేదు. అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలంలో పర్యటించి పిప్పిరి ఎత్తిపోతల పథకానికి రూ.48 కోట్లు తేజాపూర్, బుగ్గారం ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆరు నెలలు గడిచిపోతున్న నయా పైసా మంజూరుగాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపడితే వచ్చే వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. కానీ ప్రత్యేకంగా జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేకపోవడంతో మళ్లీ జిల్లా రైతాంగానికి నిరాశనే కనిపిస్తుంది.

మెరుగైన విద్యావకాశాలు

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో మెరుగైన విద్యా అవకాశాల కోసం రూ.11600 కోట్ల నిధులను కేటాయించింది. రాబోయే నాలుగేళ్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయనుంది. ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్వహించింది. దీంతో ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో మెరుగైన విద్యావకాశాలతో పాటు ఐజీటి, జేఈఈ, నీట్ స్థాయిలో విద్యాభోధన చేయడంతో పాటు ఇతర పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తారు. ఇంటిగ్రెటెడ్ పాఠశాలలతో జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

గుడిహత్నూర్‌లో రోడ్డు ప్రమాదం

గుడిహత్నూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న మూడు లారీలు సైడ్ తీసుకునే క్రమంలో వెనుక నుంచి ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. మధ్యలో ఉన్న లారీ క్యాబిన్‌లో క్లీనర్ ఇరుక్కుపోయాడు. స్థానికులు అతన్ని బయట తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. ముందున్న లారీ సర్వీసు రోడ్డుపై పడి ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. కాగా, ప్రమాద స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ చరిత్రాత్మక నిర్ణయం

● నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ● బిల్లుల అమోదంపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు ● రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకాలు ● బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ



నిర్మల్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



భైంసాలో.. క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఖానాపూర్‌లో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జులతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నిర్మల్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. బీసీ రిజర్వేషన్‌లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేస్తానని హామీ ఇచ్చి దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడు నెలల్లో శాసన ప్రక్రియను పూర్తి చేసిందని 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయం లభించినట్లైందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సమరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, కౌన్సిలర్లు కత్తి నరేందర్, ఎస్పీ రాజు, రామకృష్ణ, దర్శనం చిన్నయ్య, ఆలయ కమిటీ చైర్మన్లు గంగోని భూరాజ్, కొండ శ్రీనివాస్, కొడుకుల శ్రీకాంత్, కే. రామ్‌రెడ్డి, గాజుల రవి కుమార్, అయ్యన్నగారి పోశెట్టి, బండిశీల సాగర్, చిరంజీవి, నరేందర్, కత్తి సురేష్, కత్తి విష్ణు, బండి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

● బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ

భైంసా, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్యాఉద్యోగావకాశాల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ప్రవేశ పెట్టిన రెండు బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు రాష్ట్ర శాసన సభలో అమోదం పొందిన నేపథ్యాన్ని పురస్కరించుకొని భైంసాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి, ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు చేపట్టిన సంబరాలు హోరెత్తాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా కార్యాలయ అవరణలో పెద్ద ఎత్తును భాణసంచా కాల్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేపట్టారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. సంబరాలలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ కులగణన, ఎస్సీ వర్గీకరణ , బీసీ రిజర్వేషన్ల పెంపుదల తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే ఘట్టాలని పేర్కొన్నారు. సంబురాల్లో మాజీ ఎంపీపీలు పొద్దుటూరి రాంచందర్ రెడ్డి, చంద్రకాంత్, ఓం ప్రకాష్, సాహేబ్‌రావ్ పాటిల్, షాహీద్,శ్రీనివాస్‌లతో పాటు పలువురుప పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం దేశానికే ఆదర్శం

ఖానాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నో దశాబ్దాలుగా నెరవేరని కలగా ఉన్న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులను అసెంబ్లీ ఆమోదించేలా తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే బొజ్జులతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూషణ్, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు షౌకత్ పాషా, ఆకుల వెంక గౌడ్, వంశీ, జంగిలి శంకర్, జన్నారపు శంకర్, పరిమి సురేష్, జహీర్, లక్ష్మీపతి గౌడ్, సార్ల నర్సయ్య, మాసుల లక్ష్మీరాజం గొర్రె గంగాధర్, భూమన్న, శేషాద్రి, శంకర్, వీరేష్, నిట్ట రవి, రాజన్న, రామచందర్, నారాయణ, రాజేశ్వర్, నహీం, తదితరులున్నారు.

లక్ష్మణచాందలో ..

లక్ష్మణచాంద, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీల రిజర్వేషన్ 42 శాతానికి పెంచాలని తీర్మానం చేసినందున, ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినందున రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు మండల కేంద్రంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు కాంగ్రెస్ పార్టీ తన మాట నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి. నర్సయ్య మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ బిల్లుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీని నెరవేర్చడం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపి బీసీ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, నారాయణరెడ్డి, నవీన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కాయకల్ప బృందం



భైంసా ఏరియా ఆసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న కాయకల్ప బృందం

భైంసా, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం కాయకల్ప బృందం పరిశీలించింది. కాగజ్‌నగర్ కమ్యూనిటి హెల్త్ సెంటర్‌కు చెందిన వైద్యాధికారుల బృందం ఇక్కడ పర్యటించి ఏరియా ఆసుపత్రిలో సేవలు, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఆయా వార్డుల్లో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగానే రాష్ట్రంలో ఆయా ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. దీంతో ప్రభుత్వం ఆసుపత్రికి తగు విధమైన నాణ్యత గుర్తింపుతో పాటు అవార్డులు అందించిన గదు బహుమతి అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్



బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరం

బాసర, మార్చి, 19 : (ఆంధ్రజ్యోతి) : భైంసా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ సూచించారు. బుధవారం బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువైద్యం అందుబాటులో లేక గ్రామాలలో నేడు పెద్ద సమస్యగా మారిందని దీన్ని దృష్టిలో ఉంచుకొని శిబిరాల ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, వివిధ వ్యాధిగ్రస్త పశువులకు బాసర మండల పశువైద్యాధికారి డా. గోపాల్ మహాజన్ ఆధ్వర్యంలో ఉచిత చికిత్సలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాసర పశువైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో సీపీయస్ రద్దు

ప్రస్తావన లేక పోవడం దురదృష్టకరం

కుభీర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) వరంగల్ డిక్లరేషన్‌లో సీపీయస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టోలో కూడా పెట్టింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో సీపీయస్ రద్దు చేసి గురించి ప్రస్తావించక పోవడం దురదృష్టకరమని పెన్షన్ ఉద్యమ నాయకులు కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఒక ప్రకటనలో ఇప్పటికయిన సీపీయస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.

నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలి

ముథోల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయా శాఖల అధికారులతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు.



హాల్‌టికెట్లు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, తదితరులు

ఇష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడండి

లక్ష్మణచాంద, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా ఇష్టపడి చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజునాయక్ అన్నారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు విద్యార్థులంతా ఉన్నత ఆశయంతో కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకోవటం కోసం కష్టపడటంతో పాటు ఇష్టపడి చదివి అనుకున్నది సాధించాలన్నారు. విజయం సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుంటూ ప్రతిరోజు తమను తాము నూతనోత్తేజం చెందుతూ ముందుకు వెళ్లాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షలను అందరూ బాగా రాసి పది జీపీఏ తెచ్చుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేశారు. విద్యార్థులకు పదవ తరగతి పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవికాలంలో జాగ్రతలు పాటించాలి

కుంటాల, మార్చి, 19 : (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో విద్యార్థులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని కుంటాల ఎస్సై భాస్కరాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రం కుంటాలలో పలు పాఠశాలల విద్యార్థులకు రాబోయే వేసవికాలంలో సెలవులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. చెరువుల్లో ఈతకు వెళ్లకూడదన్నారు. అలా వెళ్లడం వలన చెరువులలో ఉన్నటువంటి గుంతలు తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేగాకుండా ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలన్నారు.కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులతో పాటు వారు పుట్టిన ఊరు పేరు నిలపాలని సూచించారు.

ఫటా.. ఫట్...

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

● తునికి గంగాధర్, మండల విద్యాశాఖ అధికారి, దస్తురాబాద్



పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు...?

అధికారి: మండల కేంద్రంలో ఒకే ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశాము.

ఆంధ్రజ్యోతి: ఎన్ని పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు...?

అధికారి : ఈ పరీక్షా కేంద్రంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల, మున్యాల్, మల్లాపూర్, కడెం మండలంలోని అంబారిపేట పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఆంధ్రజ్యోతి: పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరు కానున్నారు...?

అధికారి: మొత్తం ఆరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 139 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అందులో 54 మంది బాలురు, 85 మంది బాలికలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: పరీక్షల నిర్వహణ కోసం ఎంత మంది అధికారులను ఏర్పాటు చేశారు...?

అధికారి: పరీక్షల నిర్వహణ కోసం 9 మంది ఇన్విజిలేటర్లు, ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని ఏర్పాటు చేశాము.

ఆంధ్రజ్యోతి: పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎలాంటి వసతులను కల్పించారు...?

అధికారి: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, సరిపడా బెంచీలు, మరుగుదొడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాము.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కి పాల్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

అధికారి: పరీక్షా కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు ఎవరిని అనుమతించం. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ నిర్వహిస్తారు.

● (ఆంధ్రజ్యోతి, దస్తురాబాద్)

వేసవిలో 'ఉపాధి' కూలీల పాట్లు

● నీడ, నీరు కరువు ● పని ప్రదేశంలో వసతులు లేక కూలీల ఇబ్బందులు

తలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



నీడ లేకపోవడంతో చెట్ల కింద సేద తీరుతున్న ఉపాధి కూలీలు

ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస మౌలిక వసతులు అధికారులు కల్పించలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండల తీవ్రత తో జనం ఇంటి నుంచి బయటకు వెళ్ళేందుకే ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది ఎర్రని ఎండలో ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్తున్నప్పటికీ. పని ప్రదేశంలో నీడ లేక, తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కూలీలు వసతులు కల్పించకపోవడంతో పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలో గాను పదివేల మందికి జాబ్ కార్డు. ఉన్నప్పటికీ పను లకు మాత్రం రెండు వేల లోపు మంది కూలీలు. పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో 52 రకాల పనులు ఉన్నప్పటికీ ఆ పనులపై అధికారులు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించలేకపోవడంతో ఉ పాధి హామీ పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా పనులకు వస్తున్న కూలీలకు ప్రభుత్వం లెక్క ప్రకారం ప్రతి కూలికి 300 రూపాయలు ప్రతీ రోజు కూలి దక్కల్సి ఉండగా పనిచేసిన ప్రదేశంలో అధికార కొలతలు సకాలంలో చేపట్టకపోవడంతో. కేవలం 150 నుంచి 200 వరకు కూలీ రావడంతో నిరాశ చెందుతున్నారు. ప్రతి గ్రామ పం



ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలు

చాయతీ నుంచి 100 లోపే కూలీలు వస్తున్నారు. అంతేకాకుండా పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులు సక్రమంగా కల్పించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని జరుగుతున్న ప్రదేశంలో కూలీలు నీడ సౌకర్యం. తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలి కానీ అవేవీ ఏర్పాటు చేయడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు దూర ప్రాంతాల్లో ఉంటే వారికి రవాణా సౌకర్యం కల్పించాలి కానీ అవేవీ కల్పించడం లేదు. ఇకనైనా అధికారులు. స్పందించి ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించి కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

స్వస్థలాలకు తరలిపోతున్న మహారాష్ట్ర వలస కూలీలు

● ఉపాధి కరువై కూలీల ఆందోళన

భైంసా, మార్చి 19(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ముగింపు దశకు చేరుకుంటుండటంతో ఉపాధి కోసం వచ్చిన మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన వలస కూలీలు స్వస్థలాలకు తిరుగుముఖం పడుతున్నారు. ప్రతియేటా ఇక్కడి ప్రాంతానికి రబీ సీజన్‌లో మొక్కజొన్న కంకులు తెంపడానికి, శనగ పీకడానికి వెరుశనగ పీకి పల్లీలు తెంపడానికి అక్కడి నుంచి కూలీలు వలస వచ్చేవారు. గత దశాబ్దానికి పైగా కాలం నుంచి భైంసా మండల పరిధిలోని వాడీ, బాబల్‌గావ్‌తో పాటు పలు ప్రాంతాలకు వలస కూలీలు తమ కుటుంబీకులతో పాటుగా వచ్చి రెండు నెలల పాటు ఉపాధి పొంది స్వస్థలాలకు తిరుగుముఖం పట్టేవారు. వీరందరూ ఫిబ్రవరి మొదటి వారంలో ఇక్కడి వచ్చి మార్చి మాసం చివరలో స్వస్థలాలకు తరలేవారు. అయితే ప్రస్తుతం యాసంగి పంటల సాగు విస్తీర్ణం గతంతో పోల్చితే అర్ధశాతానికి పైగానే తగ్గిపోయింది. ప్రతికూల పరిస్థితుల మూలంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి అంతంత మాత్రంగానే సాగవుతున్న పంటలకు తడులు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దిగుబడులు సైతం తగ్గిపోతున్నాయి. దీంతో వలస కూలీలకు ఉపాధి తగ్గిపోయింది. గతంలో రెండు నెలల పాటు పూర్తిస్థాయిలో ఉపాధి పొందే వలస కూలీలకు ఇక్కడి ప్రాం తంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల మూలంగా నెల రోజుల పని కూడా లభించని పరిస్థితులు నెలకొన్నాయి. మొక్కజొన్న పంటకు వివిధ రకాల తెగుళ్లు ఆశించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అడవి పందుల బెడద మూలంగా వేరుశనగ సాగు నామమాత్రంగా జరిగింది. ఇక శనగ సాగు విస్తీర్ణం ఒక్కటి మాత్రమే గతంతో పోల్చి చూస్తే సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం ఫిబ్రవరి మాస అరంభంలో ఇక్కడికి వచ్చిన మహారాష్ట్రలోని ముత్కెడ్, నర్సి తదితర ప్రాంతాల నుంచి వలస కూలీలు స్వస్థలాలకు తరలివెలుతున్నారు. బుధవారం ముఖ్డేడ్ ప్రాంతంలోని బోర్‌వాడీ గ్రామం నుంచి వచ్చిన సీతారామ్, దత్తులతో పాటు మరో ఐదుగురు వలస కూలీలు భైంసా మీదుగా తమ స్వస్థలానికి మూటా ముల్లే సర్దుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి వారిని పలుకరించగా తమ ప్రాంతంతో పాటు ఇక్కడి ప్రాంతంలోనూ ఉపాధికి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నయన్నారు. దశాబ్దకాలంగా తమ కుటుంబీకులు ప్రతియేటా వర్షాకాలంలో తమ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు పనులు నిర్వహించి యాసంగి సీజన్‌లో ఉపాధి కోసం ఇక్కడికి వచ్చే వారమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం తమ ప్రాంతంతో పాటు ఇక్కడి ప్రాంతంలోనూ



తరలిపోతున్న మహారాష్ట్ర వలస కూలీలు

ఉపాధి కరువైందన్నారు. గతంతో తాము ఇక్కడి ప్రాంతంలో రెండు నెలల ఉపాధిలో ఎంత తక్కువగా అనుకున్నా ఒక్కో కూలీగా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అర్జించేవారమన్నారు. ప్రస్తుతం నెల రోజుల వ్యవధిలో ఒక్కొక్కరికి రూ.10 వేలకు మించి అర్జించలేదని అవేదన వ్యక్తం చేశారు.



గండి పడ్డ ఎల్లమ్మ చెరువు కట్ట

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టేదెన్నడో?

● ఉపాధి కోల్పోయిన గంగపుత్రులు

కుభీర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొడర్న ఎల్లమ్మ చెరువు 2023 జూలైలో కురిసిన భారీ వర్షాలకు నీరంతా బయటకు వెళ్లి ఖాళీ అయ్యింది. దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్న ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులలు ఆవేదన చెందుతున్నారు. ఈ చెరువులో వర్షాకాలం నీరు నిండితే కట్ట క్రింద వందలాది వ్యవసాయ బోరు బావులకు నీరు పుష్కలంగా ఉండి ప్రతీ సంవత్సరం పంట సాగుకు ఇబ్బంది వుండేది లేదని చెరువకు కట్టకు గండి ఏర్పడిన నుంచి రెండు సంవత్సరాలు ఫిబ్రవరి చివరి వరకు బోరు బావులు ఎత్తి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి, ఏప్రిల్, మే నెలలో మరమ్మతులు చేపట్టి తమకు ఉపాధి కల్పించాలని మండల కేంద్రానికి చెందిన పలువురు గంగపుత్రులు కోరుతున్నారు.

● చేయాల్సిన పని..

చెరువుకు గండి పడిన చోట పూడ్చి కట్టను బలోపేతం చేయాలి రాళ్ల తెట్టెను ఏర్పాటు చేయాలి. అలుగును కూడా పునరుద్ధరించాలి. వానా కాలం రావడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. పనులు ఇప్పుడే ప్రారంభిస్తేనే పూర్తవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ డీఈ రంజిత్‌కుమార్‌కు వివరణ కోరగా ఎల్లమ్మ చెరువుకు కట్టకు పడిన గండి పూడ్చేందుకు నిధులు మంజూరు చేయాలని నివేదికలు అందించిన ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదని మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.

బరంపూర్ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

తలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ తల్లిలో పెరిగి విడిపోతున్నందుకు బాధగా ఉందని పాఠశాల విద్యార్థులు కంటతడి పెట్టి .ఘనంగా వేడుకలు సమావేశం నిర్వహించారు. బుధవారం తలమడుగు మండలంలోని బరంపూర్ జి ల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీర ప్రత్యూష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ బరంపూర్ పాఠశాల జిల్లాకే ఆదర్శం అన్నారు. కలెక్టర్ మెచ్చిన బరంపూర్ పాఠశాలను ఉత్తీర్ణత శాతంలో ప్రతీ విద్యార్థి టెన్ జిపి సాధించాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి రావాలని కోరారు. ఎక్కడికి వెళ్ళినా పాఠశాలను ఉపాధ్యాయులను గ్రామస్తులు మర్చిపోవద్దని సూచించారు. అనంతరం సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఆ తరువాత విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో డీజే డాన్సులతో హోరెత్తించారు.

అంతా కలిసి ఆకలి తీర్చారు

● నిరుపేదను ఆదుకునేందుకు మస్కాపూర్ విద్యార్థుల వినూత్న ప్రయత్నం ● వారం రోజులుగా ఇంటి నుంచి తలా పిడికెడు బియ్యం

● విద్యార్థులు పోగేసిన 30 కిలోల బియ్యం, రూ. 1000 నగదు నిరుపేద కుటుంబానికి అందజేత

ఖానాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సహాయం చేయాలని సంకల్పం ఉండాలి తప్ప చేస్తున్న సహాయం చిన్నదా.. పెద్దదా అనేది చూడాల్సిన పని లేదని ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిరూపించారు. గత కొంత కాలంగా నిత్యం తమ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టే సమయానికి ఓ వ్యక్తి వచ్చి విద్యార్థులు తినగా మిగిలింది తిని తన ఆకలి తీర్చుకుంటున్నాడు. అది గమనించిన విద్యార్థులు అతనికి ఏదైనా సహాయం చేయాలని తలపెట్టారు. అందరూ కలిసి తలా పిడికెడు బియ్యం తేవాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా వారం రోజులుగా ఇంటి నుంచి వచ్చేటప్పుడు ఓ పిడికెడు బియ్యాన్ని తెచ్చి పాఠశాలలోని ఓ బస్తాలో వేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో తమ తమ ఇళ్ల నుంచి తలా పిడికెడు బియ్యం పట్టుకుని వచ్చారు.



బియ్యం, నగదును షేక్ ఖలీల్‌కు అందజేస్తున్న మస్కాపూర్ విద్యార్థులు

ఇలా పాఠశాల విద్యార్థులు అంతా వారం రోజులుగా తెచ్చిన బియ్యం పోగేస్తే 30 కిలోలు అయ్యాయి. దీనికి తోడు తమ వద్ద ఉన్న చిల్లర నగదును పోగేస్తే రూ.1000 జమ అయ్యాయి. దీంతో యథావిధిగా మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాల వద్దకు వచ్చిన నిరుపేద షేక్ ఖలీల్‌కు విద్యార్థులు ఈ 30 కిలోల బియ్యాన్ని, రూ. 1000 నగదును అందజేశారు. ప్రస్తుత పవిత్ర రంజాన్ మాసంలో తన కుటుంబం పస్తులు ఉండకుండా మస్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తనకు అందజేసిన సహాయాన్ని జీవితంలో మరువలేనని విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా సాటి వారికి సహాయం చేయాలనే ఆలోచనతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యార్థులను పాటశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, శోభా రాణి, చందన, రవి, కిషన్ ప్రసాద్, లక్ష్మణ్ రావు, ఫరాజ్, షఫీ, రాజారెడ్డి, స్వప్న, గంగాధర్, రమేష్, తదితరులు అభినందించారు.

జిల్లాలోని పాఠశాలలకు వంట పాత్రలు సిద్ధం!

● 717 పాఠశాలకు పంపిణీ

ఉట్నూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకం వంటలు వండడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు 717 పాఠశాలలకు సుమారు రూ.1.20 కోట్ల విలువగల వంట పాత్రలు పంపిణీ చేయడం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 20 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించి జిల్లా అధికారులు వంటలకు కావాల్సిన పాత్ర లను పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన టెండర్లలో టెండర్ పొందిన వ్యాపారాలు ఆయా మండల విద్యా వనరుల కేంద్రాలకు జిల్లా అధికారులు సూచించిన ఇండెంట్ మేరకు వంట పాత్రలను పంపిణీ చేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 717 పాఠశాలలకు మాత్రమే ఈ వంట పాత్రలు మంజూరు అయినట్లు తెలుస్తుంది. ఉట్నూర్ మండలంలో 136 పాఠశాలలు ఉండగా 20 మందికి పైగా విద్యార్థులు ఉన్న 64 పాఠశాలలకు సుమారు రూ.5.20 లక్షలతో మంజూరైన వంట పాత్రలను మంగళవారం మండల విద్యాధికారి ఆశన్న ఆదేశాల మేరకు విద్యా





ఉట్నూర్ విద్యా వనరుల కేంద్రానికి చేరిన వంట పాత్రలు, టీచర్లకు వంట పాత్రలు పంపిణీ చేస్తున్న కేంద్రం సిబ్బంది

వనరుల కేంద్రం సిబ్బంది ప్రవీణ్, ధరమ్ సింగ్, రమాలు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ వంట పాత్రల్లో గంజులు, బేసిన్‌లు, చంచలు, కట్‌గీర్‌లు, బకెట్లో ఉన్నాయి. చాలా రోజుల నుంచి వంట పాత్రలు లేక ఇబ్బందులకు గురవు తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఈ వంట పాత్రలు రావడంతో కాసింత వెసులుబాటు లభించిందని ఎండీఎం కార్మికులు అంటున్నారు. అయితే మధ్యాహ్న భోజనం అమలు అవుతున్న అన్ని పాఠశాలలకు కూడా వంట పాత్రలు మంజూరు చేసి పంపిణీ చేయాలని ఎండీఎం కార్మికులు కోరుతున్నారు.

ఉట్నూర్ ఏజెన్సీలో 'పది' పరీక్షల కోసం పది సెంటర్లు

ఉట్నూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం ఆదిలాబాద్ జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉట్నూర్ ఏజెన్సీ మండలాల్లో 10 పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలతోపాటు పులాజి బాబా స్కూల్లో ఏ, బీ కేం ద్రాలను ఏర్పాటు చేశారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ గిరిజన సంక్షేమ విద్యార్థులు పాఠశాలలో, నార్నూర్ మండల కేంద్రం లోని ఆదర్శ పాఠశాలలో, గాదిగూడ మండల కేంద్రం లోని గిరిజన సంక్షేమ విద్యార్థులు పాఠశాలలో, ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలతోపాటు బాలికల గిరిజన సంక్షేమ విద్యార్థులు పాఠశాలలో, ఇదే మండలంలోని కేస్లాపూర్



ఉట్నూర్‌లో పదో తరగతి విద్యార్థుల పరీక్షా కేంద్రం

బాలికల విద్యార్థులు పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారని ఉట్నూర్ మండల విద్యాధికారి ఆశన్న తెలిపారు.



ఇండాల గ్రామంలో నీటి కోసం భారీ సంఖ్యలో జనం ఇబ్బందులు

గొంతెండుతోంది.. తెల్లారదేమి!!

ఆదిలాబాద్ జిల్లాలో తాగు తాపం తీవ్రమవుతోంది. గొంతు తడుపుకునేందుకు ఏజెన్సీ గ్రామాలు తహతహలాడుతున్నాయి. ఆదిలాబాద్ గ్రామీణ మండలం ఖండాల గ్రామంలో నీటి వనరులు అడుగంటి పోవడంతో నాలుగు రోజులకు ఒకసారి వచ్చే మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడుతున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే ఓ ట్యాంకు దగ్గర బిందెలు పెట్టి ఎప్పుడు తెలవారుతుందా?.. నల్లా నీరు ఎప్పుడు వస్తుందా? అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఉదయం పూట ఊరంతా అక్కడికి చేరుకుని నీటి కోసం నిరీక్షిస్తున్న చిత్రమే ఇదీ..!!

● (స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

ఫొటో న్యూస్



నీరు పట్టుకుంటున్న మహిళలు



యాసంగికోసం ఆన్‌ఆఫ్ పద్ధతిలో సాగునీరు

సరస్వతీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

- మూడు ప్రధాన ప్రాజెక్టుల్లో గతం కన్నా ఎక్కువగా నీటి నిల్వలు
- పంటల చివరి వరకు నీరందించేందుకు ప్రణాళికలు
- జిల్లాలో పకడ్బందీ షెడ్యూల్ రూపొందించిన ఇరిగేషన్‌శాఖ
- తాగునీటి ఇక్కట్ల సమస్యకు పరిష్కారం

నిర్మల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత యాసంగి పంటల దిగుబడి చేతికి వచ్చే వరకు సాగునీటిని అందించేందు కోసం ఇరిగేషన్ శాఖ అధికారులు పకడ్బంధీ షెడ్యూల్ రూపొందించింది. ఈ షెడ్యూల్‌కు అనుగుణంగా జిల్లాలోని మూడు ప్రధాన ప్రాజెక్టులతో పాటు ఎస్సారెస్పీ పరిధిలోని సరస్వతీ కాలువ కింది ఆయకట్టుకు సాగునీరు అందించేందు కోసం ఆన్ ఆఫ్ పద్దతిని పాటిస్తున్నారు. ఇప్పటికే ఆన్ ఆఫ్ పద్దతిలో ప్రాజెక్టుల్లోని నీటి నిల్వల సామర్థ్యాన్ని లెక్క గడుతూ కాలువలకు నీరును వదులుతున్నారు. ఈ ఏడు యాసంగి సీజన్‌లో మొత్తం 2లక్షల84వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, శనగ పంటలతో పాటు తదితర పంటలు సాగవుతున్నాయి. ఇందులో భాగంగానే 1లక్షవేల ఎకరాల్లో వరి పంట, 1లక్ష2వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట, 50వేల ఎకరాల్లో శనగ పంటతో పాటు మరికొన్ని పంటలు సాగవుతున్నాయి. జిల్లాలోని గడ్డెన్న వాగు, కడెం ప్రాజెక్టులతో పాటు ఎస్సారెస్పీ పరిధిలోని సరస్వతీ కాలువ కింద సాగవుతున్న పంటలకు సాగునీరు అందించేందు కోసం సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే రూపొందించిన షెడ్యూల్ ప్రకారం సాగునీటిని అందించేందు కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఈ షెడ్యూల్‌కు అనుగుణంగా వారబంధి పద్దతిలో కాలువలకు నీరును విడుదల చేస్తున్నారు. గత సంవత్సరం కన్నా ఈ సారి అన్ని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్న కారణంగా రబీ పంటలకు అలాగే మిషన్ భగీరథకు నీటి కొరత ఏర్పడబోదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

గడ్డెన్న వాగు ప్రాజెక్టులో ఆశాజనకంగా నీటి నిల్వలు

జిల్లాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో ఆశాజనకంగా నీటినిల్వలు ఉండడంతో ఆయకట్టు భూములకు చివరి వరకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.964 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు ప్రతిరోజూ 80 క్యూసెక్కుల నీటిని అందిస్తుండగా మిషన్ భగీరథ పథకం కోసం ప్రతిరోజూ 20 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే 0.7 టీఎంసీల నీటి నిలువలను మిషన్ భగీరథ కోసం నిలువ ఉంచుతున్నారు.




కడెం ప్రాజెక్టు ఆయకట్టు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)

కడెం కింద 16,500 ఎకరాల సాగు

జిల్లాలో ప్రధానమైన కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 4.583 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 7.603 టీఎంసీలు కాగా రబీ పంటల కోసం 1.4టీఎంసీల నీరు అవసరం ఉందని దీనికి అనుగుణంగా వారబంధి పద్దతిలోనే కాలువల ద్వారా పంటలకు నీరును విడుదల చేస్తున్నామని అధికారులు వివరిస్తున్నారు. మిగతా అందుబాటులో ఉన్న నీరును వేసవి పూర్తయ్యే వరకు మిషన్ భగీరథ కోసం వాడనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ కాలువ కింద ఈ సారి రబీలో 16,500 ఎకరాల పంటలకుక సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ 12 వరకు షెడ్యూల్‌కు అనుగుణంగా సాగునీటిని అందించనున్నారు. అలా గే ఇక్కడి నుంచి గూడెం ఎత్తిపోథల పథకం కింద సాగయ్యే 18 ఎకరాలకు కూడా సాగునీరు అందించనున్నారు. మొత్తం 34,300 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత సంవత్సరం ఇదే రోజున ప్రాజెక్టులో 3.050 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా ప్రస్తుతం 4.583 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. దాదాపు ఒకటిన్నర టీఎంసీల నీరు గత సంవత్సరం కన్నా ఈ సారి ఎక్కువగా ఉండడంతో రబీ పంటలకు చివరి వరకు నీరందించే అవకాశాలు రెట్టింప య్యాయి.

సరస్వతీ కాలువ ఆయకట్టుకు సాగునీరు

జిల్లాలోని స్వర్ణప్రాజెక్టు పరిధిలోని పంట భూములకే కాకుండా ఎస్సారెస్పీ పరిదిలోని సరస్వతీ కాలువ ఆయకట్టుకు కూడా రబీ పంటల కోసం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించనున్నారు. స్వర్ణ ప్రాజెక్టు కింద 6వేల ఎకరాల రబీ కోసం సాగునీరు అందిస్తున్నారు. ఎస్సారెస్పీలో 90 టీఎంసీల నీటి మట్టం కారణంగా ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో 29.27 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. గత సంవత్సరం ఇదే రోజు నాటిని ఈ ప్రాజెక్టులో కేవలం 20.774 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఈసారి 9టీఎంసీల నీరు అదనంగా ఉండడంతో పంటలకు సాగునీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. దీంతో కాలువ ఆయకట్టుకు, అలాగే జిల్లాలో మిషన్ భగీరథ పరిధిలో తాగునీటిని అందించనున్నారు.



కడెం ప్రాజెక్టు ఇదే ..

పది పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పదిపరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం ప్రైవేట్ యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ చీఫ్ సూపరిండెంట్‌లతో సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫలితాల సాధనలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 47 కేంద్రాలుండగా ఇందులో 10 ప్రైవేట్ పాఠశాలలున్నాయని తెలిపారు. విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమన్వయంతో పని చేసి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుచతించవద్దని పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. విజయవంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ... పరీక్ష నిర్వహణకు నియమించిన సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పోలీసుస్టేషన్‌లో పరీక్ష పత్రాలు తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్, పర్యవేక్షకుడు వెంకటరమణ, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

సోన్ మండలంలో పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సోన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక బాలికల గురుకుల పాఠశాలలో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ తెలిపారు. 163 మంది, సోన్ ఉన్నత పాఠశాలలో 136 మంది పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు విద్యార్థులకు కొరకు త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఫ్యాన్లు ఇతర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, జిరాక్స్ సెంటర్లను మూసి వేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు అవసరమైనంత ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

ఉద్యోగాల మెరిట్ జాబితా విడుదల

నిర్మల్ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన నియమించే ఉద్యోగాల మెరిట్ జాబితా విడుదల చేసినట్టు జిల్లా వైద్యాధి కారి రాజేందర్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి, ఫార్మసిస్ట్, ఎంపీహెచ్‌ఏ, రెఫ్రిజిరేటర్ మెకానిక్, అకౌంటెంట్, పోస్టుల మెరిట్ జాబితా ఆన్‌లైన్, వైద్యాధికారి కార్యాలయంలో అందుబాటులో ఉందని తెలిపారు.

మాదిగ సంఘ భవనానికి స్థలం కేటాయించండి

జిల్లా కేంద్రంలో మాదిగ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని సంఘ నాయకులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరు చేయించాలని కోరారు. గాజుల రవికుమార్, అడ్డిగ లక్ష్మణ్, ఆనంద్, నరేందర్, డి. సాయన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆవాసానికి విరాళం

భైంసా రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడి గ్రామానికి చెందిన సూర్యవంశీ మహేందర్ తండ్రి కీ.శే సూర్యవంశీ లక్ష్మణ్ జ్ఞాపకార్థం కొరకు వివేకానంద ఆవాసానికి రూ.5 వేలు విరాళంగా అందించారు. వీరి కుటుంబానికి ఆవాస కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు ఈఈపై చర్య తీసుకోవాలి

కడెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కడెం ప్రాజెక్టు క్రింద ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్న ఈఈపై చర్య తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం, సీపీఎం పార్టీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. నీళ్లు వదలక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాయకులు డి.నూతన్‌కుమార్, డి. తిరుపతి, ఎస్. ఎల్లారెడ్డి, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష



శిక్ష పడిన నిందితుడు రాజేశ్వర్‌తో (చేతులు కట్టుకున్న వ్యక్తి), ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బైండోవర్ ఉల్లంఘించిన కేసులో మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మాసం రాజేశ్వర్ అనే వ్యక్తికి జైలు శిక్ష పడింది... వివరాల్లోకి వెళ్తే... ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపిన కథనం ప్రకారం... పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మాసం రాజేశ్వర్ అనే వ్యక్తి గతంలో నాటు సారాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. కాగా అతడిని తహసీల్దార్ ఎదుట ప్రవేశ పెట్టగా ఆ తప్పు తిరిగి చేయవద్దని రాజేశ్వర్‌ను బైండోవర్ చేశారు. ఒకవేళ రాజేశ్వర్ తిరిగి నాటు సారాయిని విక్రయిస్తూ పట్టుబడితే బైండోవర్ ప్రకారం రూ. రెండు లక్షలు జరిమానా లేదా రెండు సంవత్సరాల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని అతనికి తెలిపారు. కాగా తాజాగా రాజేశ్వర్ తిరిగి నాటు సారాయిని విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుపడడం అతడిని బుధవారం స్థానిక తహసీల్దార్ సుజాత ఎదుట హాజరు పర్చారు. దీంతో బైండోవర్ ఉల్లంఘించిన నేరం కింద రాజేశ్వర్‌ను రిమాండ్‌కు పంపమని తహసీల్దార్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాజేశ్వర్‌ను ఆదిలాబాద్ జైలుకు పంపినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ మృతి

ముథోల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామానికిచెందిన సిందే సాధన(33) అనే మహిళ మానసికంగా కృంగిపోయి జీవతంపై విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మృతురాలు గత కొంతకాలంగా మానసికంగా కృంగి ఉండడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుండి నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం చనిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అలరించిన పాఠశాల వార్షికోత్సవం

సోన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫ్రాపూర్ గ్రామంలో గల వేదిక్ పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మాజీ ఎంపీపీలు సత్యనారాయణగౌడ్, బర్ల మానసలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో తోడిశెట్టి పరమేశ్వర్, కరస్పాండెంట్ ఉమాదేవి, ప్రిన్సిపాల్ లింగయ్య, పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. మున్సిపాలిటీల వారీగా కేటాయించిన నిధులు, చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులు, అందుబాటులో ఉన్న నిధులకు సంబంధించిన వివరాలను ఆయా అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత వానాకాలం వరదల వల్ల నష్టపోయిన మౌలిక సదుపాయాలకు మరమ్మతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, తదితర భవంతుల విద్యుత్ బిల్లులు సమయానికి చెల్లించాలన్నారు. అధికారులంతా ఆదాయ సృష్టిపై దృష్టి సాధించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని పార్కులన్నింటిని అభివృద్ధి చేయాలన్నారు. సుందరీకరణ పనులను చేపట్టి ప్రజలను పార్కులకు వచ్చే విధంగా ఆకర్షించాలన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపొందించాలన్నారు. గేట్లు, గోడలకు పెయింటింగ్ వేసి, మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ వాసులను భాగస్వామ్యం చేస్తూ, పార్కులకు అసోసియేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్‌కృష్ణ, రాజేష్ కుమార్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణ గుర్తింపు

నిర్మల్ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాలను గుర్తిస్తూ సర్టిఫై చేయడం హర్షనీయమని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. సారంగాపూర్ మండలం చించోలి(బి), లక్ష్మణచాంద మండలం మల్లాపూర్, ముథోల్ మండలం తరోడా, బాసర మండలంలోని కౌట ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు లభించాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు ఇదే స్ఫూర్తిగా పని చేసి భవిష్యత్‌లో గుర్తింపు సాధించాలని, మరిన్ని ప్రోత్సాహకాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా)లో మున్సిపల్ అధికారులు బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ప్రజలకు కలెక్టర్ మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణంలో బస్టాండ్, ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అర్బన్ తహసీల్దార్ రాజు, మున్సిపల్ డీఈ హరిభువన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రేపటి నుండి జిల్లాలో నిర్వహించే పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ జానకి షర్మిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ చట్టం అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు 200ల మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండవద్దని సూచించారు. 47 కేంద్రాల వద్ద ఎలాంటి సభలు, సమావేశాలు, మైకులు, డీజేలు, ఊరేగింపు, ధర్నా తదితర వాటిని నిర్వహించవద్దని తెలిపారు. పరిసరాల్లో జిరాక్స్, ఇంటర్నెట్, స్టేషనరీ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పోలీసు పెట్రోలింగ్ పార్టీలను నియమించామని, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్య లు చేపట్టినట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



ఖానాపూర్‌లోని పద్మావతి నగర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఖానాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పద్మావతి నగర్‌లో బుధవారం వాసవీ క్లబ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... ఆర్యవైశ్య కుల గురువు పరమపూజ్య వామనాశ్రమ స్వామి 21వ శ్రీ గురు పట్టాభిషేక మహోత్సవంలో భాగంగా సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ శ్రీ మహాజన్ జితేందర్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు గన్నారపు రాజేందర్, ఖానాపూర్ వాసవీ క్లబ్ అధ్యక్షులు చిటికేశి రవీందర్, ప్రధాన కార్యదర్శి చిటికేశి సతీష్ కుమార్, కోశాధికారి కూరగాయల సతీష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు ముక్క కిషన్, నిర్మల్ జిల్లా మాజీ కోశాధికారి పాలెపు సుదర్శన్, కట్కం శేఖరయ్య, కట్కం అశోక్ కుమార్, చాడ చంద్ర మోహన్, తగిలపెల్లి రమణ, ప్రశాంత్, సంఘ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, తదితరులున్నారు.

నర్సాపూర్(జి)లో పర్యటించిన చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్



నర్సాపూర్(జి)లో అధికారులతో మాట్లాడుతున్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్

నర్సాపూర్(జి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవరత్నం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని ఎంపీఎస్‌వో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గణాంక అధికారికి పలు సూచనలు చేశారు. ఇందులో డివిజనల్ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాస్, స్థానిక మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఎస్‌వో శ్రీరామ్, తదితరులున్నారు.

ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యానికి హైకోర్టులో చుక్కెదురు


- ముందస్తు బెయిల్ రద్దు చేసిన హైకోర్టు
- యజమానులు మార్చి 26వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందే

నర్సాపూర్(జి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామ సమీపంలో గల ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ ఫిబ్రవరి నెల 24వ తేదీన సివిల్ సప్లై అధికారులు ఫిజికల్ వెరిఫికేషన్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్. రమాదేవి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించగా రైస్‌మిల్లు ఆవరణలో ధాన్యం స్టాక్ లేకపోవడంతో ప్రభుత్వానికి అందవలసిన స్టాక్‌ను నిర్ణీత సమయంలో అందించకుండా ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ కల్లూర్‌పై జిల్లా మేనేజర్ గెడం గోపాల్ 8వ తేదీ శనివారం నర్సాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రొపరేటర్ రుక్మిణి, నిర్వాహకుడు తురాట్టి వెంకటేష్‌కు 41ఏ నోటీసులు అందజేశారు. ఈ నెల 11వ తేదీన గౌరవ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు ద్వారకా మాయి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం దాఖలు బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేసింది. ఇన్వెస్టిగేషన్ పోలీసు అధికారి ముందర మార్చి 26వ తేదీన రెండు గంటలకు హాజరు కావాలని, తమ వద్ద ఉన్న పత్రాలను సమర్పించి పోలీసు విచారణకు సహకరించాలని గౌరవ హైకోర్టు ఆదేశించింది. ఇదే విషయమై నర్సాపూర్(జి) ఎస్సై సాయి కిరణ్‌ను వివరణ కోరగా బెయిల్ పిటిషన్ కొట్టి వేసింది నిజమే అని తెలిపారు. స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఆన్‌లైన్ కాపీ అందించిందని తెలిపారు.

డాక్యుమెంట్లు సేకరిస్తున్నాం : గ్రామీణ సీఐ కృష్ణ

సివిల్ సప్లై అధికారుల నుండి జీవో కాపీలు, మూడు పంటల అలాట్మెంట్ కాపీలు, లైసెన్స్ కాపీలు సేకరించామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు మార్చి 26వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ఇన్వెస్టిగేషన్ అధికారి వద్ద ఏ1 తూర్పాటి రుక్మిణి, ఏ2 తూరాట్టి వెంకటేష్ హాజరు కావాలని వారి వద్ద ఉన్న పత్రాలను సమర్పించి విచారణకు సహకరించాలని తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన సీఐ



కుంటాల, మార్చి, 19 : (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం భైంసా సీఐ నైలు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. పరీక్షకేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక సిబ్బందికి సూచించారు. ఈయన వెంట ఎస్సై భాస్కరాచారి ఉన్నారు.